

మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీపడ్డారు. బ్రహ్మంగారిమఠంలో జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ముగిశాయి.

-12లో



జవాన్ నాయక్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

వీరజవాన్ మూడే మురళీ నాయక్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని పలు పార్టీల నాయకులు కొనియాడారు.

-12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4/27.4

జిల్లాలో శుక్రవారం 27.4 – 39.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కడప వీఅండ్‌ఎస్‌ఓ సస్పెన్షన్

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా (వీఅండ్‌ఎస్‌ఓ) పని చేస్తున్న ముజబుర్ రెహమాన్‌ను సస్పెండ్ చేస్తూ ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతోపాటు అక్రమ వసూళ్లపై ఇటీవల అధికారులతో ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో పలు అంశాలు వాస్తవాలని తేలడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

జమ్మలమడుగు: పట్టణంలోని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపల్ రవికుమార్, జిల్లా నైపుణ్యాధికారి వినీల్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముద్దనూరు రహదారిలో అంబవరం పంచాయతీ పరిధిలో ఉన్న పాలిటెక్నిక్ కాలేజీలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 15వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్, డిప్లొమో ఉత్తీర్ణత కలిగి ఉండి 18 సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. వివరాలకు 90004 79991 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చునని సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రంలో శుక్రవారం హుండీ ఆదాయం లెక్కించారు. స్వామి ఆరాధన, గురుపూజోత్సవాలు ముగిసిన సందర్భంగా హుండీల ఆదాయం లెక్కింపు చేపట్టారు. 7 శాశ్వత, 4 తాత్కాలిక హుండీలు లెక్కించారు. మొత్తం రూ. రూ.47 లక్షల 26 వేలు వచ్చినట్లు ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి తెలిపారు. 8 గ్రాముల బంగారం, 530 గ్రాముల వెండి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 21 నుంచి మే 9 వరకు భక్తులు సమర్పించిన నగదు, కానుకల లెక్కింపు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతుల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, గోవింద స్వామి, వరదరాజ స్వామి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, ఆలయ సిబ్బంది, స్వామి శిష్యులు, భక్తబందం పాల్గొన్నారు.

హెచ్‌ఓడీలు, పరిపాలన సిబ్బందితో సమీక్ష

కడప అర్బన్: కడప ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను చేపట్టిన తరువాత డాక్టర్ జమున తన కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులతో, కళాశాల పరిపాలన విభాగం అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రిన్సిపాల్‌ను కలిసిన గైనకాలజీ వైద్యబృందం

ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమునను శుక్రవారం గైనకాలజీ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ లక్ష్మీసుశీలతో పాటు వైద్యబృందం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ రబ్బానీబేగం, డాక్టర్ రేఖారావు, డాక్టర్ నీలిమ, డాక్టర్ సుధారాణి, డాక్టర్ సోఫియా సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

- అలాగే కడప రిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నుంచి నాయకులు వెంకటసుబ్బయ్య, బాలాజీరావు, ఏసన్న, పవన్, తదితరులు విచ్చేసి ప్రిన్సిపాల్ డాక్టర్ జమునకు మొక్కను అందచేశారు. కడప రిమ్స్ వైద్యకళాశాలలో, ఆసుపత్రిలో కార్మికుల సమస్యలను వివరించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై ఛీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో 47,000 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పరీక్షల ఈసీ మెంబర్స్ రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు



బద్వేలులో ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న పాత్రికేయులు



వేంపల్లెలో తహసీల్దార్ హరినాథరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు



కమలాపురంలో డీటీ రోష్నికి వినతి పత్రం అందిస్తున్న పాత్రికేయులు



ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు



విజయవాడ నగరంలోని వెటర్నరీ కాలనీలో ఉన్న సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి ఇంటిపై గురువారం పోలీసులు దాడి చేయడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా.. కనీసం సెర్చ్ వారెంట్ కూడా ఇవ్వకుండా పోలీసులు ఇంటిలోకి ప్రవేశించడాన్ని తప్పుబట్టారు. ఎందుకు దాడి చేస్తున్నారని ధనుంజయరెడ్డి ప్రశ్నించినా సమాధానం ఇవ్వకుండా పోలీసులు వ్యవహరించిన తీరును జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసుల తీరుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛను హరించడమేనని నినదించారు.



ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పాత్రికేయులు

- 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడి హేయం
- జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన
- పత్రికా స్వేచ్ఛపై ప్రభుత్వతీరును ఎండగట్టిన వైనం
- అధికారులకు వినతి పత్రాల అందజేత

కడప కార్పొరేషన్/కడప కోటిరెడ్డిసర్కిల్: నోటీసులు ఇవ్వకుండా విజయవాడలో ఉంటున్న సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి ఇంటిలోకి పోలీసులు ప్రవేశించి సోదాలు నిర్వహించడంపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు, జర్న లిస్టు సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. కడపలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సాక్షి జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేసి ఆర్డీఓ జాన్ ఇర్విన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతోపాటు ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికారంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా భావిస్తున్నామన్నారు. జర్నలిస్టులు ఫణిశేఖర్, కిశోర్‌బాబు, దుర్గాప్రసాద్, విశ్వప్రసాద్, కొండయ్య, యల్లారెడ్డి, జయరాజు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేయడం తగదు

కమలాపురం: పత్రికా రంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని ఏపీయూడబ్ల్యుజే జిల్లా ఉపాధ్యక్షుడు గెంటెం సురేష్ బాబు తెలిపారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డికి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు ఆయన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి సెర్చ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిప్యూటీ తహసీల్దార్ రోష్ని కు వినతి పత్రం అందజేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మహ్మద్ రఫీ, కరుమూరి చంద్ర, శివరామక్రిష్ణ, రవి కుమార్, విజయ్ బాబు, కేశవ, మస్తానయ్య పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటు

బద్వేలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడం, అక్రమ కేసులు బనాయించడం వంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్, సీనియర్ పాత్రికేయులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీఓ ఎ.చంద్రమోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టు సంఘాల నాయకులు వి.వి.రమణ, రఘు, రాజన్న, మోహన్ క్రిష్ణ, రాజు, సుభాష్, శేఖర్‌రాయల్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

వేంపల్లె: ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడంపై శుక్రవారం వేంపల్లె మండల జర్నలిస్టులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ హరినాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వేంపల్లె మండల జర్నలిస్టులు మధుసూదన్ రెడ్డి, దివాకర్ రెడ్డి, బాలం మనోహర్, సుబ్బారెడ్డి, చిన్నా రెడ్డి, కేశవ ప్రతాప్ రెడ్డి, దొంతు సతీష్, గఫార్, కృష్ణమోహన్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు: పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని ప్రొద్దుటూరు జర్నలిస్టులు శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి అనుమతులు లేకుండా పోలీసులు సోదాలు నిర్వహించినందుకు నిరసనగా ప్రొద్దుటూరు జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దారు వి.గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

కక్షసాధింపు మానుకోవాలి



జమ్మలమడుగులో ఆర్డీఓ కార్యాలయ డీటీలకు వినతి పత్రం ఇస్తున్న ప్రెస్ క్లబ్ నాయకులు

జమ్మలమడుగు: ఎడిటర్లు, విలేకరులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటని జమ్మలమడుగు ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు సోదాలు చేయడం అప్రజాస్వామికం అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ నిజా ముద్దీన్, రూపేష్‌లకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, అబ్దుల్ బషీర్, మహబూబ్ హుస్సేన్, హాజీ మహమ్మద్, శివ, చిన్ని కృష్ణ, విష్ణు వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కారాగారంలో..
కాసులకు కక్కుర్తి

కారాగారం అంటేనే కట్టుదిట్ట భద్రత.. కఠిన నియమ నిబంధనలు ఉంటాయి. అయితే కొందరు సిబ్బంది కాసులకు కక్కుర్తి పడుతున్నారు. రూల్స్ బ్రేక్ చేసి దబ్బుకు దాసోహం అవుతున్నారు. రిమాండ్ ఖైదీ బ్యారక్‌లో ఏకంగా తొమ్మిది సెల్‌ఫోన్‌లు దొరికాయంటే సిబ్బంది చేతివాటం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇక బీడీ, సిగరెట్, గుట్కా తదితరాలు ఖైదీలకు చేరుతున్నాయంటే.. వారు ఆమ్యామ్యాలకు ఎంతగా అలవాటు పడ్డారో తెలుసుకోవచ్చు. ఇప్పటికే డిప్యూటీ జైలర్, హెడ్ వార్డర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. అయినా సిబ్బంది తీరు మారలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇది కడప కేంద్ర కారాగారం కథ.



కడప కేంద్ర కారాగారం



- కాసులు ఇస్తే ఖైదీలకు ఫోన్‌కాల్స్..
- రిమాండ్ ఖైదీ బ్యారక్‌లో సెల్‌ఫోన్లు
- కడప కేంద్ర కారాగారంలో ఓ శ్రేణి అధికారుల, సిబ్బంది కక్కుర్తి
- ఖైదీల పెట్రోల్ బంకులోనూ యథేచ్ఛగా 'అవినీతి'
- ఇప్పటికే డిప్యూటీ జైలర్, హెడ్ వార్డర్ ఇరువురు సస్పెన్షన్
- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం

కడప అర్బన్: సెంట్రల్ జైళ్లలో, సబ్‌జైళ్లలో జరిగే సంఘటనలు.... కొందరు అవినీతి అధికారుల, సిబ్బంది చేతుల మీదుగా జరుగుతాయనే భావన కేవలం సినిమాల్లోనే చూపిస్తుంటారు. అదంతా రీల్ లైఫ్. కానీ రియల్ లైఫ్‌లో ఇలాంటి సంఘటనలు సబ్‌జైళ్లు, కేంద్రకారాగారాల్లో జరగవనీ, భద్రత ఏర్పాట్లు బలంగా ఉంటాయని.. నిరంతరం సీసీ కెమెరాల నిఘా డీజీపీ కార్యాలయం నుంచి ఉంటుందని ప్రజలకు తెలుసు. జైలు, కారాగార అధికారులు కూడా ఇదే చెప్పుకొస్తుంటారు. అయితే .... ఇటీవల కడప కేంద్ర కారాగారంలో జరిగిన కొన్ని సంఘటనల ద్వారా కారాగారాల్లో ఏమైనా జరగవచ్చు...ఏమైనా చేసుకోవచ్చు అనే భావన ప్రజల్లో కలుగుతోంది. కొందరు తృతీయ, కింది స్థాయి సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు.

ఖైదీ బ్యారక్‌లో 9 సెల్‌ఫోన్లు..

పలుకుబడి ఉంటే ఏమైనా చేసుకోవచ్చనే ధోరణిలో రిమాండ్ ఖైదీలు ఉన్నట్లు తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బంది డబ్బుకు దాసోహం అవడంతోనే వీరి ఆటలు సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎర్రచందనం కేసులో పట్టుబడి రిమాండ్‌లో వున్న జాకీర్ అనే పి.డి. యాక్ట్ రిమాండ్ ఖైదీ వున్న బ్యారక్‌లో వారం రోజుల కిందట ఆకస్మిక తనిఖీలలో సెల్‌ఫోన్ దొరికింది. ఇప్పటివరకు అదే ఖైదీ దగ్గర 9 సెల్‌ఫోన్‌లు దొరికాయంటే కారాగార అధికారులకే అంతుచిక్కడంలేదు. కారాగార అధికారుల పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. తనిఖీల సమయంలో పి.డి.యాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ ఎన్ని సెల్‌ఫోన్‌లనైనా లోపలికి రప్పించుకుంటాను. అధికారులు సెల్‌ఫోన్‌లు లోపలికి రావడాన్ని ఆపలేరంటూ సవాలు విసిరినట్లుగా తెలుస్తోంది. ఇతని వ్యవహారంలో డిప్యూటీ జైలర్ హరినాథ, వార్డెన్ సుబ్బరాయుడులను సస్పెన్షన్ చేశారు. జాకీర్ వద్ద దొరికిన సెల్‌ఫోన్‌ను, సిమ్ కార్డును రిమ్స్ పీఎస్‌లో అప్పగించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

- కావేరి బ్యారక్‌లో కరుడుగట్టిన నేరస్తులను ఉంచుతారు. వీరికి నేరప్రవృత్తి కలిగిన మనసు వుంటుంది. వారిని బయటకు రానీయరు. కానీ ప్రత్యేక పరిస్థితులు, అనుమతులతో వున్న నేరస్తులను (పి.డి.యాక్ట్ లాంటి రిమాండ్ ఖైదీలు) తుంగభద్ర బ్యారక్‌లో వుంచుతారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా కావేరీ బ్యారక్‌లో ఉంచాల్సిన నిందితులను తుంగభద్ర బ్యారక్‌లోనే ఉంచడం ఎంతవరకు సమంజసం? అధికారుల విచక్షణకే వదిలేయాల్సి వుంది. ఇలాంటి విధానాలు తుంగలో తొక్కి అధికారులు ప్రవర్తించే తీరు ఏమేరకు జరుగుతోందో తెలియాల్సివుంది.
- మరోవైపు పెట్రోల్ బంక్‌లో 24/7 పద్ధతిలో సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలు షిఫ్టుల రూపంలో విధులను నిర్వహిస్తూ వుంటారు. వీరి విధులను పర్యవేక్షిస్తూ, ఆర్థిక లావాదేవీలను సరిచూసుకునేందుకు కారాగార సిబ్బందిని ఇక్కడ అధికారులు నియమించారు. ఇక్కడ ప్రతిరోజూ బహిరంగంగా అవినీతి జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పత్రికల్లో వచ్చినా, అధికారులను ప్రశ్నించినా వారు నామమాత్రంగానే పర్యవేక్షణ జరపడం, మరలా యథావిధిగా అదే సిబ్బందిని నియమించి వారి అవినీతిని ప్రోత్సహించడం పలురకాల ఆరోపణలకు తావిస్తోంది.
- కడప కేంద్ర కారాగారంలోని కొందరు అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీలు, విచారణలు చేపడితే డొల్లతనం బయటపడే అవకాశాలున్నాయి.



- గుట్కా, రాజాఖైనీ, బీడీలు, సిగరెట్లు సైతం సిబ్బందికి చేతులు తడిపితే ఇక్కడికి సరఫరా అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిమాండ్, జీవిత ఖైదీలను చూసేందుకు వచ్చే వారి బంధువులు, స్నేహితులు తమకు తోచినంతగా రూ. 1000 నుంచి రూ.10 వేల వరకు డబ్బులను డిపాజిట్ చేయడం 'చీటీ'ల టోకెన్‌ల ద్వారా తమవారికి అందేలా చూస్తుంటారు. అంతకుమించి అనధికారికంగా తమకు పరిచయం వున్న వారి ద్వారా 'ఫోన్ పే' అకౌంట్‌ల ద్వారా డబ్బులను అందచేసే విధానాన్ని కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది అలవాటుగా మార్చుకున్నారు.

సమగ్రంగా అన్ని సంఘటనలపై విచారణ చేస్తాం



కడప కేంద్ర కారాగారంలో జాకీర్ అనే రిమాండ్ ఖైదీ వద్ద మాత్రమే సెల్‌ఫోన్ దొరికింది. పెట్రోల్ బంక్ నిర్వహణను ప్రత్యేకంగా ఓ డిప్యూటీ జైలర్‌కు అప్పగించాం. అన్ని రకాల సంఘటనలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి విచారణ చేస్తున్నాం. ఇప్పటికే డిప్యూటీ జైలర్‌ను, వార్డర్‌ను సస్పెండ్ చేశాం. సెల్‌ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాం. సిగరెట్లు, బీడీలు, ఇతర గుట్కా సంబంధిత వాటి సరఫరా జరగడంలేదు. సమగ్రంగా విచారణ చేస్తున్నాం. – రాజేశ్వరరావు, సూపరింటెండెంట్, కడప కేంద్ర కారాగారం

ఉగ్రవాదంపై పోరుకు దేశ ప్రజల అండ

- సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడి దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ఉగ్రవాదంపై ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న పోరుకు దేశ ప్రజలంతా అండగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం రాత్రింబవళ్లు కాపుకాస్తున్న సైనికులకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందన్నారు. వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషియల్ మీడియా నాయకులను వేధించడమే లక్ష్యంగా తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా కేవలం పదినెలల కాలంలోనే రూ.1.70 లక్షల కోట్లు అప్పులు చేశారని, ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటి పై పోలీసుల దాడులు అప్రజాస్వామికమన్నారు. తమ తప్పులను ప్రశ్నించే వారు ఉండకూడదనే సాక్షిపై కక్షగట్టారన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్నవారందరినీ లక్ష్యంగా చేసుకొని లేని లిక్కర్ స్కాంను తెరపైకి తెచ్చి అబద్ధాలే ఆరోపణలుగా కేసులు పెడుతున్నారన్నారు. ఈ కక్షసాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, పాక సురేష్ కుమార్, బంగారు నాగయ్య యాదవ్, బాలయ్య యాదవ్, సుబ్బయ్య, త్యాగరాజు, వాసుదేవ రెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, కంచుపాటి బాబు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య


ప్రతాప్ మృతదేహం

పులివెందుల రూరల్ : జిల్లా లోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పులివెందుల పట్ట ణంలోని పాత ప్రభుత్వాసుప త్రి సమీపంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతాప్(30) అనే వ్యక్తి పట్టణంలో పెయింట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఒక కు మారుడు ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక..


మృతి చెందిన నవ్యశ్రీ

కొండాపురం : మండల పరిధిలోని టి.కోడూరు గ్రామంలో ఓ యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ ఆర్.బాసు వివరాల మేరకు.. మండలంలోని టి. కోడూరు గ్రామానికి చెందిన బుండన్నగారి రాజ వంగనూరు సమీపంలోని జాతీయ రహదారి పక్కన మొబైల్ క్యాంటీన్ పెట్టుకొని జీవనం సాగించే వాడు. బుడన్నగారి రాజ పెద్ద కుమార్తె బి.నవ్యశ్రీ(17) థైరాయిడ్‌తోపాటు కడుపు నొప్పి తాళలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతిదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

- ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం



ప్రత్యేక అలంకరణలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, మహాప్రసాదం పంపిణీ చేస్తున్న ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజి

బ్రహ్మంగారిమఠం : 'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి ప్రసాదం స్వీకరించడం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మంగారిమఠంలో ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం చేపట్టారు. బియ్యం, బెల్లం, నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష, యాలక్కలు, ఎండుకొబ్బరి, పాలు తదితరాలతో మహాప్రసాదాన్ని తయారు చేశారు. గర్భాలయంలో స్వామి వారి ఎదురుగా.. ఒక రాశిలా పోసి నివేదించారు. అనంతరం మఠం ఫిట్ పర్సన్ సి.శంకర్‌బాలాజి, పూర్వపు మఠాధిపతి కుమారులు ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు స్వీకరించి కళ్లకు అద్దుకుని ఆరగించారు. మరికొందరు ఇంటికి తీసుకెళ్లారు. భక్తులతో క్యూలైన్‌లు కిటకిటలాడాయి. మహాప్రసాదానికి ప్రొద్దుటూరు నియోజకవర్గం సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

మహాప్రసాదం విశిష్టత

మహాప్రసాదం అనగా గొప్ప ప్రసాదం అని అర్థం. దేవతలకు నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేస్తారు. ఒక్కొక్క చోట ఒక్కో విధంగా ఇస్తారు. తమిళనాడులోని అన్ని శివాలయాల్లో విభూదిని ప్రసాదంగా అందజేస్తారు. అమ్మవారి ఆలయాల్లో కుంకుమ ఇవ్వడం జరుగుతుంది. అలాగే వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలో 'విశేష గుడాన్నం' అందిస్తారు. దీనిని స్వీకరించిన వారికి సంతానం, వివాహం తదితర కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు హాజరు కాలేని వారికి, తర్వాత వచ్చే వారికి ప్రసాదం అందించే పద్ధతి ఇక్కడ ఉంది. ప్రసాదాన్ని ఎండబెట్టి, తేమ లేకుండా నిల్వ చేసి సుమారు రెండు నెలల వరకు భక్తులకు అందజేస్తారు. కొందరు ప్రసాదాన్ని పార్శిల్ ద్వారా తెప్పించుకుంటారు. 'నిద్రపోవు వారికి, నా వద్ద లేని వారికి ప్రసాదం అబ్బదు' అనేది బ్రహ్మంగారి కాలజ్ఞాన వాక్యం. కావున భక్తులందరూ ప్రసాదం స్వీకరించడానికి అమితాసక్తి ప్రదర్శిస్తారు.

ఉత్సాహ భరితంగా ఉత్సవం

ఉదయం ఉత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్ద మఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిప తులు శ్రీ వీరశివకుమారస్వామి విశేష పూజలు చేశారు. ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. కడప పుట్టా యాడ్స్‌కు చెందిన అమృతమ్మ, వెంకటసుబ్బయ్య శ్రేష్టి, లక్ష్మీదేవి ఉభయదారులుగా వ్యవహరించారు. తెల్లవారు జామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలో నిస్వామి, అమ్మవారి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలతో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేద పారాయణం చేశారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వ రస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరా జస్వామి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బా లాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నాడు మట్కా బీటర్లు.. నేడు గంజాయి విక్రేతలు

– నలుగురు అరెస్ట్, 1500 గ్రాముల గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : వీరు పేరు మోసిన మట్కా బీటర్లు. ఏళ్ల తరబడి మట్కా నిర్వహిస్తూ ఎందరి జీవితాలలో నాశనం కావడానికి కారకులయ్యారు. ఇటీవల పోలీసులు క్రికెట్ బెట్టింగ్, మట్కా దాడులు ముమ్మరం చేయడంతో వీళ్లు మట్కా రాయడం మానుకున్నట్లు తెలుస్తోంది. దీంతో గంజాయి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి ప్రొద్దుటూరులో విక్రయిస్తుంటారు. ఈ విషయం పోలీసుల చెవిన పడటంతో.. వీరి అక్రమ వ్యాపారానికి బ్రేకులు పడ్డాయి. పెన్నా నదిలోని ఆర్టీపీపీ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన షేక్ హుస్సేన్‌బాషా అలియాస్ గూగూడు, సయ్యద్ ఖాదర్ అలియాస్ కదీర్‌తో పాటు పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన టప్పా నసీర్ రసూల్ , షేక్ జమాల్‌బాషాను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1500 గ్రాముల గంజాయి, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హుస్సేన్‌బాషా అలియాస్ గూగూడుపై గతంలో మట్కా, లిక్కర్, గంజాయి తదితర సుమారు 46 కేసులు ఉన్నాయి. అలాగే సయ్యద్ ఖాదర్ అలియాస్ కదీర్‌పై కూడా వివిధ పోలీస్‌స్టేషన్లలో గంజాయి, మట్కా, లిక్కర్ తదితర సుమారు 48 కేసులు ఉన్నాయి. నసీర్ రసూల్, జమాల్‌బాషాలపై రెండేసి చొప్పున కేసులు ఉన్నాయి. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కడపకు చెందిన రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను ప్రతిభ గల పేద రెడ్డి విద్యార్థులు స్కాలర్‌షిప్ మంజూరు కోసం కార్యవర్గంలో నిర్ణయించుకోవాలని సంస్థ సభ్యులు తెలిపారు. అర్హత గల విద్యార్థిని, విద్యార్థులు రెడ్డి సేవా సమితి కార్యాలయం నుంచి దరఖాస్తులు పొంది.. మే 31వ తేదీలోగా దరఖాస్తు పూర్తి చేసి రెడ్డి సేవా సమితి కార్యాలయంలో సమర్పించాలని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, గుడ్ల నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పూర్తిగా పరిశీలించిన తర్వాత అర్హులకు స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నట్లు వారు వివరించారు. వైద్య విద్య అభ్యసించే విద్యార్థి నీట్ ర్యాంకు పొంది ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొంది ఉండాలని, వారికి ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్ రూపంలో రూ.25 వేలు ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్య (బీటెక్) అభ్యసించే అభ్యర్థులు ఎంసెట్‌లో 10 వేలలోపు ర్యాంకు పొంది ఉండాలని, అలాంటి వారి స్కాలర్‌షిప్ కింద రూ. 25 వేలు ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు రూ.10 వేలు, ఇతరులకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థికి ప్రతి ఏడాది స్కాలర్‌షిప్ కింద రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ, వెటర్నరీ బీఎస్సీ విద్యను అభ్యసించే వారికి ఎంసెట్‌లో ర్యాంకు పొంది ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొంది ఉండాలని, అలాంటి వారికి ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్ కింద రూ.20 వేలు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. దాఖలు చేసిన దరఖాస్తులను కమిటీ సభ్యులు పూర్తిగా పరిశీలించి, విచారణ చేసి ఆర్థిక స్థోమత గురించి చర్చించి రెడ్డి సేవా సమితి వారికి స్కాలర్‌షిప్ కోసం సిఫార్సు చేయనున్నట్లు వివరించారు. స్కాలర్‌షిప్ విషయంలో రెడ్డి సేవా సమితి వారిదే తుది నిర్ణయమని తెలిపారు.

చనిపోయిన వ్యక్తి వచ్చి అర్జీ ఇచ్చాడట!

- ఆ మేరకు ప్రతివాదికి నోటీసులు పంపిన రెవెన్యూ అధికారులు

మైలవరం : నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న రీతిలో వ్యవహరించారు మైలవరం రెవెన్యూ అధికారులు. చనిపోయిన వ్యక్తి వచ్చి అర్జీ ఇస్తే ఆగమేఘాలపై స్పందించిన మండల తహసీల్దార్.. ప్రతివాదికి నోటీసులు జారీచేసి విచారణకు రావాలంటూ కబురు పంపారు. తీరా శుక్రవారం విచారణకు హాజరైన ప్రతివాది తనపై చనిపోయిన వ్యక్తి వచ్చి స్వయంగా ఫిర్యాదు చేశాడని తెలిసి అవాక్కు అయ్యాడు. ఆద్యంతం ఆసక్తి గొలిపే ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం ధన్నవాడ గ్రామానికి చెందిన చెక్కా బాలుడు అనే వ్యక్తికి 2005లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 346-3 సర్వే నంబర్‌లో 1.70 ఎకరాల అసైన్డ్ భూమిని మంజూరు చేసింది. ఆ మేరకు నాటి మైలవరం మండల రెవెన్యూ అధికారులు బాలుడుకు పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారు. నేటికి ఆ భూమికి సంబంధించిన అడంగల్, వన్‌బీ, ఆన్‌లైన్‌లో బాలుడు పేరే చూపిస్తుంది. విచిత్రం ఏమిటంటే ఆ భూమి తనది అని బాలుడి పేరును ఆన్‌లైన్‌లో తీసివేయాలంటూ వంగల శేషారెడ్డి పేరుతో ఓ వ్యక్తి.. మైలవరం మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఏప్రిల్ నెలలో అర్జీ ఇచ్చాడట. అసలు అర్జీదారుడు బతికి ఉన్నాడా.. లేదా అని కూడా విచారణ చేయకుండా రెవెన్యూ అధికారులు ఈ నెల 3న బాలుడికి నోటీసులు పంపారు. ఊరు పేరు లేని వ్యక్తి తనపై ఫిర్యాదు చేయడం ఏంటని నివ్వెరపోయిన బాలుడు అధికారుల నోటీసు మేరకు విచారణకు హాజరు అయ్యాడు. తీరా అక్కడికి వచ్చిన బాలుడికి అసలు విషయం తెలిసి అవాక్కయ్యాడు.

ఆ వ్యక్తి ఊరిలో లేడంటున్న గ్రామస్తులు

చనిపోయిన వ్యక్తి ఇచ్చిన అర్జీకి మైలవరం రెవెన్యూ అధికారులు స్పందించారన్న వార్త కలకలం రేపడంతో వాస్తవాల కోసం.. సాక్షి బృందం గ్రామస్తులను ఆరా తీసింది. అసలు వంగల శేషారెడ్డి అను పేరు గల వ్యక్తి తమ గ్రామంలో ఎవరూ లేరని ధన్నవాడ గ్రామస్తులు ఘంటాపథంగా చెబుతున్నారు. మరో విచిత్రం ఏంటంటే వంగల శేషారెడ్డి అనే వ్యక్తి వెలుగోడు ప్రాంతానికి చెందిన వాడని, 20 సంవత్సరాల క్రితం కూలీ పనుల నిమిత్తం కొన్నాళ్లు ఈ ఏరియాకు వచ్చి వెళ్లాడని, ఆ తరువాత కొంత కాలానికి మరణించాడని, అతనికి ఈ భూమికి సంబంధం లేదంటూ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునను వివరణ కోరగా.. ఇది భూమి తగదాకు సంబంధించిన అంశమని, వీటిపై పూర్తి స్థాయి విచారణ జరిపిన తరువాత స్పందిస్తామన్నారు. చనిపోయిన వ్యక్తి వచ్చి మీకు ఎలా అర్జీ ఇచ్చాడన్న ప్రశ్నకు అధికారులు నీళ్లు నములుతున్నారు తప్ప, జవాబు చెప్పలేక పోతున్నారు. ఏది ఏమైనా నిజనిజాలపై విచారణ చేయకుండా కింది స్థాయి సిబ్బంది మాటలు విని.. అధికారులు ఇలాంటి పనులు చేస్తే చివరకు నవ్వుల పాలు కాక తప్పాదని ఈ సంఘటన చెప్పకనే చెబుతుంది.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాజుపాలెం : వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు ఉదయం విశేష అభిషేకాలు, అర్చనలు వేద పండితులు నిర్వహించారు. సంజీవరాయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు, రంగురంగుల పూలు, పుత్తడి ఆభరణాలతో అలంకరించారు. అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి, తరించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వీర జవాన్ పోరాటం.. స్ఫూర్తిదాయకం

కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళి


కడపలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న నాయకులు


ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

కడప కార్పొరేషన్ : వీరజవాన్ మూడే మురళీ నాయక్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని పలు పార్టీల నాయకులు కొనియాడారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎర్రముక్కపల్లె సర్కిల్‌లోని అమరవీరుల సైనిక స్థూపం వద్ద ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి మురళీ నాయక్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అసువులు బాసిన జవాన్ మురళి నాయక్ యువతరానికి ఆదర్శనీయమన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన జవాను మురళి నాయక్ యుద్ధభూమిలో ప్రాణాలు కోల్పోయిన వార్త అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. దేశం కోసం ఆయన వీర మరణం పొందారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, సీపీఐ నాయకులు వెంకట శివ, వేణుగోపాల్, టీడీపీ నాయకుడు తిరుమలేష్, సంఘం రాష్ట్ర కోశాధికారి శివా నాయక్, జిల్లా అధ్యక్షుడు, జగన్ రాథోడ్, చెన్న క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉండాలని గిరిజన సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేద్రి సుధాకర్ అన్నారు. శుక్రవారం కడపలోని తారక రామనగర్‌లో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో శ్రీచరణ్ పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా..

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్న భారత సైన్యానికి మద్దతుగా శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ కాగడాల ప్రదర్శన పుట్టపర్తి సర్కిల్ వరకు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహల్గాం ఘటనలో ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపడం దారుణమన్నారు. జాతీయ జెండాలను చేతపట్టి భారత్ మాతాకి జై, హిందూస్థాన్ జిందాబాద్, పాకిస్థాన్ డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ ముక్తియార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, నంద్యాల కొండారెడ్డి, మురళీధర్‌రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడు మురళి నాయక్

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మరణించిన వీర జవాన్ మురళి నాయక్ అమరవీరుడని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళి నాయక్ నిజమైన హీరో అన్నారు. మురళి నాయక్ కుటుంబానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని, ఆయన వీర మరణం పొందడం ద్వారా తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దేశానికి చాటి చెప్పాడు అన్నారు. వీర జవాన్ మురళి నాయక్ ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

– మరొకరికి గాయాలు


మృతి చెందిన రామిరెడ్డి

చక్రాయపేట : మండలంలోని మారెళ్ళ మడక సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మూలి రామిరెడ్డి (55)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఏఎస్ఐ రాజశేఖరరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మారెళ్ల మడక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చక్రాయపేట మండలం కుప్పం గ్రామం బురుజుపల్లెకు చెందిన మూలి రామిరెడ్డి మృతి చెందగా, వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన దిద్దికుంట కొండారెడ్డి గాయపడ్డారు. రామిరెడ్డి, కొండారెడ్డి కలిసి వేంపల్లెలోని ఓ వివాహానికి హాజరై బురుజుపల్లెకు వెళుతుండగా.. మారెళ్లమడక సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో వెనక కూర్చొన్న రామిరెడ్డి పొలానికి వేసిన ఫెన్సింగ్ స్తంభానికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ కొండారెడ్డిని ప్రథమ చికిత్స నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి వైద్యుల సూచన మేరకు కడపకు తీసుకెళ్లారు. రామిరెడ్డి మృతదేహాన్ని వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించి పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి..

– కదిరి మండల వాసి కామసముద్రంలో మృతి


మృతి చెందిన హైదర్‌వలి

లింగాల : అనంతపురం జిల్లా కదిరి మండలం చెలంకూరు పల్లె గ్రామానికి చెందిన బెల్లం హైదర్‌వల్లి (58) అనే వ్యక్తి వైఎస్‌ఆర్ జిల్లా లింగాల మండలం కామసముద్రం గ్రామంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి మండలం చెలంకూరుపల్లెకు చెందిన హైదర్‌వలి అనే వ్యక్తి బేల్దారి పనుల కోసం లింగాల మండలం కామసముద్రం గ్రామానికి వచ్చారు. ఆయన కామసముద్రం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువు గట్టు మీద నుంచి చెరువులోకి పడిపోయాడు. ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు హైదర్‌వలికి ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. కుమారుడు బాబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. హైదర్‌వల్లి మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

– ఫాతిమా మెడికల్ కళాశాల నిర్లక్ష్యమేనని పలువురు ఆరోపణ


ఓబులేశు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోగల ఫాతిమా మెడికల్ కళాశాలలో భవన నిర్మాణ కార్మికుడిగా, కళాశాలలో కూలీ పనులు చేసే ఓబులేశు అనే వ్యక్తి విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. ఆయన శుక్రవారం కళాశాల కార్యాలయ గది రెండవ అంతస్తు నిర్మాణంపై ఉన్న లిఫ్టనకు కరెంటు రావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వారం రోజులుగా లిఫ్టనకు విద్యుత్ షాక్ కొడుతోందని కూలీలు యాజమాన్యానికి తెలియజేసినా పట్టించుకోలేదని.. ఓబులేసు లిఫ్ట్ చైన్ వైరు తాకడంతో షాక్‌కు గురై మృతి చెందాడని పలువురు తెలియజేస్తున్నారు. కాగా మృతుడికి ఇద్దరు చిన్న పిల్లలు ఉండగా, ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దళితుడైన ఓబులేసు మరణానికి కారణమైన ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య డిమాండ్ చేశారు.

ప్రొద్దుటూరులో పేలిన ఐపీ బాంబు!

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో మరో ఐపీ బాంబు పేలింది. ప్రముఖ ఆయిల్‌మిల్లు వ్యాపారి రూ.2.70 కోట్లకు ఐపీ పెట్టినట్లు తెలుస్తోంది. మహాత్మాగాంధీ ఆటోనగర్ ఎదురుగా ఉన్న ఓ ఆయిల్ మిల్లు యజమాని పెద్ద మొత్తంలో బాకీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అతను పట్టణంలోని కొంత మంది వ్యక్తులతోపాటు పలు బ్యాంకుల్లో కూడా అప్పులు తీసుకున్నాడు. రెండు రోజుల నుంచి ఆయిల్ మిల్లు మూసి ఉండటంతో పాటు ఇంటి వద్ద కూడా అతను కనిపించలేదు. పైగా ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో రుణదాతలు ఆందోళన చెందసాగారు. వ్యాపారంలో ఒడిదుడుకుల వల్ల అతనికి నష్టాలు వచ్చినట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది. ప్రొద్దుటూరులోని కోర్టులో వ్యాపారి ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. రేపో, మాపో రుణదాతలకు నోటీసులు కూడా అందనున్నాయి.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : వంట గ్యాస్ లీక్ కావడంతో దొరసానిపల్లెలోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి పోసా పుల్లయ్య ఇంట్లో గ్యాస్ లీక్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో వాషింగ్ మిషన్, ఉడ్ మంచాలు, టీవీ, ఉడేన్ కబోర్డులు, ఇతర సామగ్రి మంటల్లో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో శుక్రవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ మోహన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నముక్కపల్లె గ్రామం తూర్పు వైపున దాడులు నిర్వహించామని అన్నారు. అక్కడ గంజాయి, పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 2.570 కేజీల గంజాయితోపాటు రూ 20,500 నగదు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.